

# కోతకు గురైన బీటీ రోడ్లు

సాలేగూడలో బీటీ రోడ్డు వద్ద కూలిన కల్వర్టు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని సాలేగూడ, సమక, తేజాపూర్, దస్నాపూర్, ఖైరిగూడ, దోడంద, గట్టెపల్లి గ్రామాల్లో బీటీ రోడ్లతో పాటు మట్టి రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. గ్రామాల నుంచి మండలానికి రాకపోకలు చేస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించి కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాల నుంచి రక్షణ చర్యలు కల్పించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 23



ప్రమాదకరంగా మారిన సమక బీటీరోడ్డు

# ఎమ్మెల్యే కోవ లక్ష్మికి క్షమాపణ చెప్పాలి



నార్నూర్‌లో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్, ఫిబ్రవరి 23 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అధికారికంగా నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అగౌరవ పర్చిన సీఎం రేవంత్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తప్పించే ఆదివాసీ ముద్దుబిడ్డ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఫొటో ఫ్లెక్సీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అధికారిక కార్యక్రమంలో ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై మండి పడ్డారు. సమావేశంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్, సహకార సంఘం చైర్మన్ సురేశ్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ, నాయకులు లోకండే చంద్రశేఖర్, అలంఖాన్, రాథోడ్ పరమేశ్వర్, సుల్తాన్‌ఖాన్, ముక్తార్, రాథోడ్ దిలీప్, మోహన్, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం చెబుతాం

నార్నూర్, ఫిబ్రవరి 23 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాల్లో ఆదివాసీ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అవమానించిన కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం చెబుతామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షుడు ఆడా శ్రీరామ్ స్పష్టం చేశారు. ఆదివారం నార్నూర్‌లోని కుమ్రం భీం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాల్లో ప్రొటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యేను అగౌరవ పర్చిన ఉత్సవ కమిటీ, జిల్లా కలెక్టర్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్ రావ్, నాయకులు మడావి సాగర్, మడావి ఆనంద్‌రావ్, ధర్ము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షుడు శ్రీరామ్

## శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 23: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి తెలిపారు. ఈ నెల 25, 26, 27వ తేదీల్లో భక్తుల రద్దీని బట్టి బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. నిర్మల్ డిపో నుంచి వేములవాడకు 30 బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ప్రత్యేక బస్సులు అదనపు చార్జీలతో నడుపబడుతాయని మహాలక్ష్మీ పథకం లబ్ధిదారులకు అనుమతించబడదని తెలిపారు. వేములవాడకు రూ.270 పెద్దలకు, పిల్లలకు రూ.140 ఉంటుందని వీటితో పాటు కదిలి పాపహరేశ్వర ఆలయం, బూరుగుపల్లి, కాల్వ ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

## వాలా దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 23 : వాకర్స్ అండ్ లాఫింగ్ అసోసియేషన్ నిర్మల్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాలం శ్రీనివాస్, సురేందర్ రెడ్డి మాట్లాడారు. నడకతోనే మానసిక ఉల్లాసం అలాగే నవ్వడం ద్వారా ఆయువృద్ధితో పాటు ఆయుష్షు కూడా పెరుగుతుందని అన్నారు. అనంతరం డిగ్రీ కళాశాలలో పలు పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో గెలుపొందిన సభ్యులకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వాలా సభ్యులు పాల్గొన్నారు.

## 12 పంచాయతీలకు ఆరు ఎంపీటీసీలు

దిలావర్‌పూర్. ఫిబ్రవరి 23: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో 12 గ్రామ పంచాయతీలకు గాను ఆరు ఎంపీటీసీ స్థానాలు గుర్తించినట్లు ఎంపీడీవో అరుణరాణి తెలిపారు. ఆరు ఎంపీటీసీల్లో దిలావర్‌పూర్–1, దిలావర్‌పూర్–2, గుండంపల్లి, కాల్వ, బన్సపల్లి, సాంగ్వీ గ్రామాలను ఎంపీటీసీ స్థానాలుగా కేటాయించామని పేర్కొన్నారు. కాల్వ ఎంపీటీసీ స్థానంలో మొత్తం ఓటర్లు 3565, సిర్గాపూర్ ఎంపీటీసీ స్థానంలో మొత్తం ఓటర్లు 3140, సాంగ్వి ఎంపీటీసీ స్థానంలో మొత్తం ఓటర్లు 2959, దిలావర్‌పూర్–1 ఎంపీటీసీ స్థానంలో మొత్తం ఓటర్లు 2943, దిలావర్‌పూర్–2 ఎంపీటీసీ స్థానంలో మొత్తం ఓటర్లు 2928, గుండంపల్లి ఎంపీటీసీ స్థానంలో మొత్తం ఓటర్లు 3173 మంది ఉన్నారు. మండలంలో జడ్పీటీసీకి స్థానానికి 18,708 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

## శాఖాహారంపై అవగాహన కల్పిస్తున్నాం

ఎదులాపురం, ఫిబ్రవరి 23 : ప్రతి జీవి రక్షించబడాలనే లక్ష్యంతో ప్రజల్లో శాఖాహారంపై అవగాహన కల్పిస్తున్నామని ది పిరమిడ్ సేవాదళ్ తెలంగాణ అధ్యక్షుడు భూపతి రాజు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లో తిరుమల తిరుమతి దేవస్థాన కల్యాణ మండపం నుంచి మహాకరుణ మెగా శాఖాహార ర్యాలీని తీశారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధులగుండా సాగి తిరిగి కల్యాణ మండపానికి చేరుకుంది. దారి పొడవున మాంసాహారం వల్ల కలిగే అనార్థలను తెలియజేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు సంతోష్ పీఎస్ఎస్ఎం హైదరాబాద్ సభ్యులు దామోదర్, శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, గౌరవాధ్యక్షుడు నరేందర్, సీనియర్ మాస్టార్లు సునీత వెంకట్, పెంటాజీ, కందుల జితేందర్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థి ప్రతిభ

ఎదులాపురం, ఫిబ్రవరి 23 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థిని ముండే రుమాతాయి ప్రస్తుతం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీజీ సెకండ్ ఇయర్ చదువుతూ యూజీసీ నెట్ జేఆర్ఎఫ్ చరిత్ర సబ్జెక్ట్‌లో అర్హత సాధించింది. ఆదివారం ఆమెను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘు గణపతి, చరిత్ర అధ్యాపక విభాగం యాకోబలి, పృథ్వీరాజ్, సోని, కళాశాల సిబ్బంది అభినందించారు.

## బాధితురాలిని పరామర్శించిన కలెక్టర్

ఎదులాపురం, ఫిబ్రవరి 23 : ఆదిలాబాద్‌లో పది రోజుల క్రితం అత్యాచారానికి గురై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను కలెక్టర్ రాజర్షి షా ఆదివారం పరామర్శించారు. బాధిత బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన వారికి భరోసా ఇచ్చారు. రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించడానికి ఆదేశించారు.

## పేదలకు అండగా నిలవాలి

బేల, ఫిబ్రవరి 23: నమాజ్‌లను ఆచరిస్తూ.. తమ పరిసర ప్రాంతాల్లో ఉన్న పేదలకు అండగా నిలవాలని ఆధ్యాత్మికవేత్త గయాజ్ అహ్మద్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని దాహిగావ్ గ్రామంలోని దారుల్ ఉలూమ్ అజీజియా మదర్సా 13వ వార్షిక వేడుకలు ఆదివారం నిర్వహించారు. మదర్సాలో దివ్య ఖురాన్‌ను కంఠస్థం చేసిన ఎనిమిది మంది విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో మదర్సా నిర్వాహకులు అక్బరుద్దీన్ ఇస్సామి, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# కొరవడుతున్న మానసిక ప్రశాంతత



ఎదులాపురం: మాజీ మంత్రిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎదులాపురం, ఫిబ్రవరి 23 : ఆధ్యాత్మిక మార్గంలో శాంతి స్థాపనతో పాటు మానసిక ప్రశాంతత కొరవడుతుందని మాజీమంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపాల్‌గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో మహాగణపతి, నవగ్రహ, దత్తాత్రేయ, షణ్ముఖ, ఆంజనేయ సహిత శ్రీ సీతా రామ లక్ష్మణ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు భక్తులు, మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు చేసి వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. గ్రామస్తులు నిర్వహించే ప్రతి కార్యక్రమానికి పూర్తి సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంద్రత్ రమేశ్, కొండ గణేశ్, సతీశ్, కుమ్ర రాజు, ఉగ్గే విఠల్ పాల్గొన్నారు.

### ప్రసన్నజిత్ హెమ్లేకు అంబేద్కర్ సమాజ రత్న అవార్డు

భైంసా, ఫిబ్రవరి 23 : నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నజిత్ హెమ్లేకు ఆదివారం ఆదిలాబాద్‌లోని చిలుకూర్ లక్ష్మీనగర్‌లో ఉన్న సంఘం కార్యాలయంలో గురు రావిదాస్ జయంతి సందర్భంగా మాజీమంత్రి జోగు రామన్న చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తుండడంపై ఈ అవార్డును అందజేశారన్నారు. సమాజానికి మేలు చేయడం బాధ్యతగా భావించి సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 23 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని లక్కెట్టిపేట గ్రామానికి చెందిన ఉప్పు నర్సయ్య ఇల్లు ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లక్కెట్టిపేట గ్రామానికి చెందిన ఉప్పు నర్సయ్య ఆదివారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. కాగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అదేవిధంగా ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికులతో కలిసి మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పింది. అప్పటికే ఇంట్లో సామగ్రి, బంగారం, వ్యవసాయ పనిముట్లు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.10లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్, ఫిబ్రవరి 23 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని కామోల్ గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామోల్ గ్రామానికి చెందిన హంపోలి ప్రభాకర్ రెడ్డి (42) కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు.

## వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

నర్సాపూర్(జీ), ఫిబ్రవరి 23 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లో రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు. భైంసాకు చెందిన సంతోష్ అతని అన్నయ్య గౌతమ్ నిర్మల్‌లో పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై రాత్రి 11గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. నర్సాపూర్(జీ) గ్రామం 61 ఎన్‌హెచ్ హైవే జాతీయ రహదారిపై రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే వారిని నిర్మల్ జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలించగా దవాఖానలో చికిత్స పొందుతూ సంతోష్ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుభీర్, ఫిబ్రవరి 23: కుభీర్–భైంసా రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలైన సింధే సంతోష్ నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుభీర్‌లోని వస్త్ర దుకాణంలో పని చేసే యువకుడు భైంసా నుంచి తిరుగు ప్రయాణంలో ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో సంతోష్‌కు బలమైన గాయాలయ్యాయి. దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాయకుడు జాన్సన్ నాయక్

పెంబి, ఫిబ్రవరి 23: నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన మొక్కజొన్న కాపరికి వెళ్లిన రాపెని మైసయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బైరెడ్డి గాంగారెడ్డి, నాయకులు గాండ్ల శంకర్ ఉన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉట్నూర్: పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉట్నూర్, ఫిబ్రవరి 23 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో 1999–2000 పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత ఒక దగ్గరకు చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం నాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 23: నిర్మల్‌లోని కసూబా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.



నిర్మల్ అర్బన్: 2005–06 బ్యాచ్ విద్యార్థులు

# కొండ గోవర్ధన్‌కు డాక్టరేట్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 25 : నిర్మల్‌కు చెందిన కొండ గోవర్ధన్‌కు రాజనీతి శాస్త్రంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ వరించింది. గోవర్ధన్ ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజానీతి శాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. పొలిటికల్ పార్టిసిపేషన్ అండ్ పొలిటికల్ అవేర్నెస్ ఆఫ్ గ్రాస్ రూట్ ఇన్ ఆదిలాబాద్ డిస్ట్రిక్ అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఆయన చేసిన పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆదివారం ప్రవాసీ మిత్ర కార్మిక సంఘం అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల, సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మెరుగు సాయికుమార్, తూముల శ్రీనివాస్, గంగాకిషన్, ఫిసియొద్దీన్ పాల్గొన్నారు.



గోవర్ధన్‌ను సన్మానిస్తున్న ప్రవాసీ మిత్ర కార్మిక సంఘం సభ్యులు

# సీఎం రేవంత్ రెడ్డి ప్రధానిని విమర్శించే హక్కు లేదు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

తలమడుగు, ఫిబ్రవరి 23: తెలంగాణలో ఈ నెల 27వ తేదీన జరిగే పట్ట భద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉండం గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో బోథ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా ముఖ్య కార్యకర్తలు, 25 ప్రబారీల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తక్కువ సమయంలోనే వ్యతిరేకత వచ్చిందన్నారు. ప్రధానమంత్రి మోదీని విమర్శించే హక్కు సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసింది ఏమి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో చేసింది ఏమి లేదన్నారు. మూడు స్థానాల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకరినే బరిలో దించిందన్నారు. 25 మంది ఓటర్లకు ఒక కార్యకర్త పని చేయాలన్నారు. సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి, ఎంపీ నగేశ్, ఆదిలాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అధ్యక్షులు బ్రహ్మానంద్, రాథోడ్ రితేశ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసిని రెడ్డి, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి బోయర్ విజయ్, రాష్ట్ర నాయకులు మయూర్, అరిగెల నాగేశ్వర్‌రావ్, సంతోష్, తాటిపెల్లి రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ఠాపనలో బీఆర్ఎస్ నాయకులు



: విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్

లోకేశ్వరం, ఫిబ్రవరి 22 : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని ధర్మోరా గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనలో బీఆర్ఎస్ నాయకులు, జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మంద భాస్కర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు ప్రశాంత్, సంజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు అనిల్, ప్రకాశ్, గ్రామస్తులు ఉన్నారు.

# ఘనంగా హీరాసుక జయంతి

ఎదులాపురం, ఫిబ్రవరి 23 : గోండి ధర్మ గురు హీరాసుక జయంతి వేడుకలు ఆదివారం ఆదిలాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరాసుక దేవస్థానంలో కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఉద్యమ నాయకులు కుమ్రం భీం, కుమ్రం సూరు విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో పలువురు నాయకులు మాట్లాడారు. ఐక్యమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, రిటైర్డ్ ఎస్పీ బాపురావ్, రిటైర్డ్ తహసీల్దార్ కోవ మనోహర్, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్ రెడ్డి, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెస్రం శంకర్, సిడాం రాంకిషన్, పీవీటీజీ ఏపీవో మనోహర్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

## పేకాటస్థావరంపై దాడి

దండేపల్లి, ఫిబ్రవరి 23 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ గ్రామ శివారులో రహస్యంగా పేకాటాడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తహసినొద్దీన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. డబ్బులు పందెంగా పెట్టి పేకాటాడుతున్న నిజాముద్దీన్, ఎస్నవేణి మల్లేశ్, బియ్యాల సత్తయ్య, జాడి మల్లేశ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.3100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన

ఃఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 23: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సూర్జాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోఉపాధ్యాయులు సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహ దాత పాఠశాల పీజీ హెచ్‌ఎం సిలాలి ఊర్మిల, గద్దె నిర్మాణానికి విరాళం గాజుల గంగాధర్, గోపి రేకుల షెడ్డు ప్రదానం చేశారు. దురిశెట్టి శ్రీనివాస్ టైల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో జంగిలి శంకర్, రాజేందర్, బక్కి కృష్ణ, నరేందర్, గాజుల గంగన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంగీత, సౌజన్య, శ్యాంప్రసాద్, లక్ష్మి, ప్రకాశ్, లావణ్య, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు